# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భోగాపురం విమానాశ్రయం నిర్మాణం ద్వారా ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

2. **అమరావతి రాజధాని గ్రామాల్లో 900 కోట్ల రూపాయలతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

3. **విభిన్న ప్రతిభావంతుల సంక్షమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**

4. **వికసిత్ భారత్ సాధనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చెప్పారు.**

===========================

విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోలకు సంబంధించి ట్రైల్ రన్ ఈరోజు నిర్వహించారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, విమానయాన శాఖ అధికారులతో కలిసి వచ్చారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణం ద్వారా ఉత్తరాంధ్ర కు ఉపాధి అవకాశాలతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ..

వాయిస్...35 సెకన్లు

---------------------------

అమరావతి రాజధాని గ్రామాల్లో 900 కోట్ల రూపాయలతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని గ్రామం ఐనవోలులో శాసనసభ్యులు శ్రావణ్ కుమార్‌తో కలిసి మంత్రి గత రాత్రి పర్యటించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని రాజధాని గ్రామాల అభివృద్ధిపై గ్రామస్థుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..

వాయిస్...32 సెకన్లు

---------------------------

మాతృభాషను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరి పైనా ఉందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. గుంటూరులో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయమూర్తులకు ఆంగ్లంతోనే ఎక్కువ సంబంధం ఉంటుందన్నారు. చట్టాలు, తీర్పులు ఆంగ్లంలోనే ఇస్తున్నామన్నారు. రాచరిక, జమీందారు పాలనల్లో తెలుగు భాషకు అపాయం కలగలేదని తెలిపారు. ఆంగ్లేయుల పాలన వల్ల ఇప్పటికీ ఆంగ్ల భాషలోనే చట్టాలను, వైద్య, న్యాయ విద్య చదువుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఈరోజు తెలుగు మహాసభల్లో మారిషస్ దేశాధ్యక్షులు ధరంబీర్ గోకుల్ జిసిఎస్కే పాల్గొన్నారు. రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు.

-------------------------

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలు చర్చి సెంటర్‌లో లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి మంత్రి ఈరోజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు 6000 రూపాయల పింఛను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

-------------------------

వికసిత్ భారత్ సాధించడానికి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర స్థాయి ఖాదీ మహోత్సవ్ – 2025–26లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన నిన్న రాత్రి ప్రారంభించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ కోరుతూ..

వాయిస్...34 సెకన్లు

-------------------------

భారత ఎన్నికల కమిషన్ (ECI) ECINet యాప్ ను మరింత ప్రజోపయోగంగా తీర్చిదిద్దేందుకు ఓటర్ల నుంచి సూచనలు కోరుతోంది. ప్రతి ఒక్కరూ ECINet యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, అందులోని Submit a Suggestion ట్యాబ్ ద్వారా తమ అభిప్రాయాలను ఈ నెల 10వ తేదీ వరకు తెలియజేయవచ్చని పేర్కొంది. ఈ యాప్ ట్రయల్ వెర్షన్ ద్వారా మెరుగైన ఓటర్ సేవలు, పోలింగ్ శాతం వివరాలు త్వరగా లభిస్తాయని వివరించింది. అధికారుల అభిప్రాయాలతో యాప్‌ను నిరంతరం మెరుగుపరుస్తుండగా, ఈ నెలలోనే అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

-------------------------

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)గా ( వీబీ–జీ రామ్ జీ) మార్చడాన్ని తిరుపతి జిల్లా వాసులు స్వాగతిస్తున్నారు. ఈ పథకంలోని పని దినాలు 100 రోజులు నుంచి 125 రోజులకు పెంచడం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పని దినాలు పెంచడం ద్వారా ఆర్థికంగా లబ్ది పొందుతామని తిరుపతికి చెందిన బాబు రెడ్డి

పేర్కొంటూ..

వాయిస్...19 సెకన్లు

---------------------------

ఉన్నత పాఠశాలలు, కళశాలల్లో రేపటి నుంచి ఈనెల 9వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తెలిపింది. రాష్ట్రంలో 10 లక్షల 57 వేల మంది 17ఏళ్ల లోపు వారు బయోమెట్రిక్ వివరాలు అప్డేట్ చేసుకోవాల్సి ఉందని పేర్కొంది. నీట్, జెఈఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని శిబిరాల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లకు సూచించింది.

---------------------------

విజయవాడ బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవం జరుగుతోంది. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం పుస్తక మహోత్సవం జరిగే పదకొండు రోజుల్లో కనీసం 8 నుంచి 10 లక్షల మంది పుస్తక ప్రియులు వస్తారని అంచనా వేస్తున్నట్లు విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు తెలిపారు. ఎక్కువగా యువత పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారని వివరించారు.

---------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఈరోజు, రేపు దట్టమైన పొగమంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశము వుందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 17 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వానికి, అభివృద్ధి, సంక్షేమం రెండూ ముఖ్యమేనని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సంక్షేమాన్ని అమలు చేస్తూనే.. అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందనే నమ్మకంతోనే పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. కేవలం 18 నెలల్లోనే 25 లక్షల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ కృషి, పట్టుదలకు నిదర్శనమని వెల్లడించారు.

=====================